సమాచారం

రేపటి ఓయూ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో రేపు జరిగే పరీక్షలను వాయిదా వేసినట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు పేర్కొన్నారు. మార్చి 1న యూజీసీ నెట్ పరీక్ష కారణంగా ఎంఏ ఇంగ్లిష్ 3వ పేపర్ పరీక్షను 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో డిసెంబర్‌లో జరిగిన వివిధ డిగ్రీ రెగ్యులర్ కోర్సుల పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల 3, 5 సెమిస్టర్ పరీక్షలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు. పరీక్షలో తప్పిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం మార్చి 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని, రూ.200 అపరాధ రుసుంతో 8 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 13, పొడుగు వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 18, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 35, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 30, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మహిళల రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. సోమవారం ఇండియన్ ప్రజా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే బిల్లును మార్చి 15వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

మార్షల్‌ఆర్ట్స్ శరీర దారుఢ్యాన్ని పెంచుతాయి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కరాటే, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్‌లు శరీర దారుఢ్యంతో పాటు మానసిక వికాసాన్ని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని రామ్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీ నైబర్ హుడ్ కమ్యూనిటీహాల్‌లో తైక్వాండో అసోసియేషన్, హైదరాబాద్ తెలంగాణ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ కలర్ బెల్ట్ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సుమారు 150 మంది విద్యార్థులకు కలర్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తైక్వాండోలో శిక్షణ తీసుకోవడం వల్ల క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, తెలంగాణ జనరల్ సెక్రటరీ వాహజ్ అలీ, మాస్టర్ ఎగ్జామినర్ నర్సింహ్మ, మాస్టర్ కృష్ణ, రమేష్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నాంజనేయులు, కిరణ్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళ అదృశ్యం


అప్పల నర్సమ్మ

సనత్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జయచందర్ వివరాల ప్రకారం..బేగంపేట బ్రాహ్మణవాడీకి చెందిన అప్పల నర్సమ్మ (47) మతిమరుపు సమస్యతో బాధపడుతుంది. ఆదివారం ఇంట్లో కుమార్తె దుర్గ నిద్ర లేవక ముందే నర్సమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

టీ డబ్బులు ఇవ్వమన్నందుకు దాడి

సనత్‌నగర్: టీ తాగి డబ్బులు ఇవ్వమన్నందుకు యజమానితో పాటు టీ మాస్టర్‌పై ఓ యువకుడు దాడికి పాల్పడిన ఘటన ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని బీఆర్ఎస్ జెండా వద్ద రాజు (28) టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్థానికంగా ఉండే యశ్వంత్ అలియాస్ బన్నీ (23) వచ్చి టీ తాగి డబ్బులివ్వకుండా వెళ్లిపోయి మరోమారు వచ్చి టీ తాగాడు. డబ్బులివ్వమన్నందుకు టీ మాస్టర్‌గా పనిచేస్తున్న పరశురాం (27)పై ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో పాటు అడ్డువచ్చిన రాజు సైతం దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అన్ని హంగులతో వైకుంఠధామం


శ్మశానవాటిక మధ్యలో ఏర్పాటు చేసిన గ్రీనరీ

- చివరి దశలో పనులు
- త్వరలో అందుబాటులోకి..
- ఎమ్మెల్యే కృష్ణారావు చొరవతో తీరనున్న దశాబ్దాల కల


ఆధునిక హంగులతో దహనవాటికలు

సనత్‌నగర్: ఐదారు దశాబ్దాల సమస్య అది. ఆప్తులు దూరమై బరువెక్కిన గుండెలు ఒకవైపు.. ముళ్ల పొదలు, సరైన రోడ్డు సదుపాయం లేక బురదమయమై ఉండే ఆ మార్గంలో పాడెనెత్తుకుని అడుగు తీసి అడుగు వేయలేక పడే బాధ మరోవైపు.. తీరా అక్కడికి వెళితే ఓ బడా స్కూల్ ఆధీనంలో ఉన్న ఆ స్థలంలో దహన సంస్కారాలు చేయనిస్తారో లేదోనని ఆందోళన ఇంకోవైపు. దహన సంస్కారాలు చేయాలంటే బతుకున్నవారు చావాల్సిన పరిస్థితులు అక్కడ ఉండేవి. ఇదీ బేగంపేట ధనియాలగుట్ట శ్మశానవాటిక ఒకప్పటి పరిస్థితి. ఆ ప్రాంతానికి ఎంతోమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చారు. వారందరితోనూ బేగంపేట వాసులు మొరపెట్టుకున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి ఓ మూలన పడేసినట్లుగా ఉండే ఆ ప్రాంతం వైపు అంతగా కన్నెత్తి కూడా చూడరు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు గెలుపే ఆ ప్రాంత చిరకాల స్వప్నానికి బీజం వేసిందనే చెప్పాలి. ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడి ప్రజల దశాబ్దాల డిమాండ్‌ను నెత్తినేసుకున్నారు. అప్పటివరకు శ్మశానవాటికకు నిర్దిష్టమైన స్థలం అంటూ లేదు. ప్రభుత్వాలను సైతం శాసించే బడా స్కూల్ యాజమాన్యాన్ని సైతం ఢీకొని కేసులను సైతం లెక్కచేయకుండా శ్మశానవాటికకు స్థలం కేటాయించేందుకు ఒక దశలో మాధవరం చూపిన చొరవ అంతా ఇంతా కాదు. దహన సంస్కారాలకు ఎంతోకొంత స్థలం దక్కితే చాలనుకున్న అక్కడి ప్రాంత ప్రజలకు ఏకంగా మూడున్నర ఎకరాల స్థలాన్ని కట్టబెట్టేలా పోరాడి సాధించారు. దాదాపు ఏడున్నర కోట్ల రూపాయలతో అత్యాధునిక సకల సదుపాయాలతో నగరంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారు.

చుట్టూ గ్రీనరీ ఏర్పాటు

విశాలమైన రోడ్లు, నాలుగు దహనవాటికలు, పూజ, పిండ ప్రదానం హాల్, కట్టెలు నిల్వ, అస్తికలు భద్రపరిచే, స్నానాల గదులు వంటి వసతులతో పాటు మంచి నీటి సంప్, ఎలక్ట్రికల్, టాయిలెట్స్ వంటి సర్వత్రా సౌకర్యాలు కల్పించారు. మధ్యలో అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దిన తీరు అకట్టుకుంది. ఇక ధ్యానముద్రలో ఉన్న పరమశివుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శ్మశానవాటికలోని రోడ్ల వెంబడి, చుట్టూ గ్రీనరీని ఏర్పాటు చేస్తున్నారు. అతి త్వరలో దీనిని ప్రారంభించనున్నారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ, భగత్‌సింగ్, వడ్డెరబస్తీ వంటి దాదాపు 20 బస్తీలకు ఈ శ్మశావాటిక అందుబాటులోకి రానుంది.

పనులు పరిశీలన..



సకల సదుపాయాలతో నగరంలోనే రోల్ మోడల్‌గా బేగంపేట ధనియాలగుట్ట శ్మశానవాటికను తీర్చిదిద్దడం జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. దశాబ్దాల కాలంగా బేగంపేటవాసులు ఎదురుచూస్తున్న శ్మశానవాటిక పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులతో కలిసి సోమవారం ఆయన శ్మశానవాటిక అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటికి బేగంపేట ప్రాంత ప్రజలు శ్మశానవాటిక స్థలం లేక ఎన్నో ఇబ్బందులు పడేవారని, తాను గెలిచిన వెంటనే ఇక్కడి వాసులు చిరకాల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని స్థలం కోసం పోరాడి సాధించడం జరిగిందన్నారు.

ఇచ్చిన మాటకు ఎంత దూరమైన వెళ్తా..

బేగంపేట ధనియాలగుట్ట శ్మశానవాటిక స్థలం కేటాయింపు విషయంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజల కోసం లెక్కచేయలేదు. ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి ఆ హామీలను నెరవేర్చి చూపించాం. ధనియాలగుట్ట శ్మశానవాటిక అభివృద్ధితో దాదాపు 20 బస్తీలకు ఎంతో ఉపయోగకరం. అలాగే మయూరిమార్గ్, అల్లంతోటబావి ప్రాంతాలకు ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా పనులు కొనసాగుతున్నాయి.

– మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే

దశాబ్దాల కల నెరవేరింది..

అంతకముందు ఉన్న ఎమ్మెల్యే, ఎంపీలు ఎవరూ కూడా ధనియాలగుట్ట శ్మశానవాటిక గురించి పట్టించుకున్నపాపన పోలేదు. కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావు గెలిచిన నాటి నుంచి ఇక్కడి ప్రజల చిరకాల డిమాండ్‌పై దృష్టి సారించడమే కాకుండా ఏడున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి చూపించారు. ఒకప్పుడు వెళ్లలేని పరిస్థితి నుంచి ఇప్పుడు రాష్ట్రంలోనే మోడల్ శ్మశానవాటికగా మారింది.



– టి.మహేశ్వరిశ్రీహరి, కార్పొరేటర్

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సామల హేమ

చిలకలగూడ : అంధత్వ రహిత తెలంగాణ కోసం ప్ర భుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఇందిరానగ ర్ యుపీహెచ్‌సీలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఇప్పటి వర కు ఎంతమందికి కళ్లద్దాలు అందించారు.. రోజుకు ఎంతమందికి వైద్యసేవలు అందిస్తున్నారు వంటి వి వరాలతో పాటు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్ల పనితీరుపై ఆరా తీశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో యజ్ఞంలా కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విద్యను అభ్యసిస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని బ్రాహ్మణబస్తీ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆమె సందర్శించి పలు అంశాలపై ఆరా తీసి విద్యార్థులతో ముచ్చటించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేసవికాలంలో ఎక్కువగా నీళ్లు తాగాలని, వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని తల్లితండ్రులతో పాటు చదువుచెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమతి, సునీత పాల్గొన్నారు.

ఫీజుల పెంపుపై ఓయూ విద్యార్థుల రాస్తారోకో

ఉస్మానియా యూనివర్సిటీ: మొదటి సంవత్సరం పీజీ కోర్సుల పరీక్ష ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ సోమవారం ఓయూ విద్యార్థులు క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యార్థులు ఆందోళన చేపట్టిన అధికారులు స్పందించకపోవడంతో సాయంత్రం 6 గంటల వరకు రోడ్డుపైనే బైఠాయించగా 15 మంది విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రవేశ ద్వారాలను మూసివేయడంతో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఓయూ ట్రాఫిక్‌ను దారి మళ్లించడంతో తార్నాక నుంచి నల్లకుంట వరకు, విద్యానగర్ నుంచి శివం వరకు ట్రాఫిక్ జామ్‌తో మూడు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి చిన్న విషయానికి ఓయూ క్యాంపస్ ప్రవేశ ద్వారాలు మూసివేయడంతో ఈ మార్గం గుండా వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్


మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్య సేవలు పొందలేకపోతున్న ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలిచి ఆదుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌కు చెందిన సరోజకు సీఎంఆర్ ఎఫ్ నుంచి విడుదలైన రూ.2.50 లక్షల మంజూరు పత్రాన్ని సోమవారం ఆయన బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగంచేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రీతి మృతి కారకులను కఠినంగా శిక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిలకలగూడ: మెడికో ధరావత్ ప్రీతి మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రీతి మరణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన నిందితుడు సైఫ్‌కు ఉరిశిక్ష విధించాలన్నారు. రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు, నేరాలు, ఘోరాలు జరుగుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఈ ఘటనలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారని, ప్రీతి కుటుంబానికి అన్నివర్గాల ప్రజలతోపాటు బీజేపీ అండగా ఉంటుందన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని నిర్మూలించాలి..

లాలాపేట: మెడికల్ విద్యార్థి ప్రీతి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తార్నాకలో విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థులను బలిగొంటున్న ర్యాగింగ్ భూతాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలనీ విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ప్రత్యేక చట్టం చేయాలన్నారు. ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ర్యాగింగ్ భూతానికి బలైన మెడికో ప్రీతి మృతికి ఓయూలో విద్యార్థులు, అధ్యాపకులు నివాళులర్పించారు. ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్సీ, ఎస్టీ అధ్యాపక, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని రాత్రి ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట


బొడ్రాయి ప్రతిష్టలో పాల్గొన్న శ్రీగణేశ్, బస్తీవాసులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లో బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలకు టీఆర్ఎస్ నేత శ్రీగణేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠకు సహకారం అందించిన శ్రీగణేశ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలంలోనే ప్రత్యేక బస్తీగా ఏర్పడిన పికెట్ లక్ష్మీనగర్ బస్తీలో ఇన్నాళ్లకు బొడ్రాయిని ప్రతిష్ఠించడంలో బస్తీవాసుల కృషి ఎనలేనిదన్నారు. రాబోయే రోజుల్లో ఆలయంతో పాటు బస్తీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, వినోద్, నాని, సుధాకర్, రోహిత్, సదానంద్, అజయ్, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

చెన్నకేవశరెడ్డిని గెలిపించండి

సనత్‌నగర్: టీటీజేఏసీ బలపరిచిన పీఆర్‌టీయూ టీఎస్ అధికారిక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ఆ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ మండలం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్‌టీ యూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నవకేశవరెడ్డికి త మ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సీహెచ్.నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎంబీ రవీందర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న యూనియన్ నాయకులు

బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుండగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం జెక్‌కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద శక్తి కేంద్ర ఇన్‌చార్జి కంజర్ల సదాశివయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మేకిన్ ఇండియా నినాదంతో ఎన్నో రకాల వస్తువులను మన దేశంలోనే తయారుచేసి ఇతర దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామన్నారు. కోవిడ్ వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు అందించిన ఘనత భారత్‌దే అన్నారు. రాష్ట్రంలో సైతం బీజేపీ సర్కార్ వస్తేనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతాయన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలతో ప్రజలను మోసం చేయడానికే పరిమితమైందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు అర్థం చేసుకుని బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, నాయకులు కన్నూరి క్రాంతికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగేశ్వర్‌రెడ్డి

'బీజేపీ జెండా ఎగరడం ఖాయం'

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి గండికోట నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో మాణికేశ్వర్‌నగర్ అభివృద్ధికి నోచుకోలేదని ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ప్రస్తుత పాలకులు ఇక్కడి ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. దాదాపు 30 వేల జనాభా ఉన్న మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి లేకపోడం దారుణమన్నారు. మాటలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వీరన్న, తార్నాక డివిజన్ అధ్యక్షులు రాము వర్మ, సుక్క గణేష్‌రావు, అజయ్, నాని, ఎల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్యాంసుందర్ గౌడ్

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్..

బన్సీలాల్‌పేట్: తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవా రం రామస్వామి కంపౌండ్‌లో బీజేపీ నాయకురాలు సరస్వతీ, స్పందనల అధ్వర్యంలో జరిగిన ప్రజాగోస–బీజేపీ భరోసాలోమహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయకర్త టి. రాజశేఖరరెడ్డి, వై. సురేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అప్పులతో రాష్ట్రాన్ని అధోగతి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు, సకాలంలో పెన్షన్ డబ్బులు రాక పేదలు నానా పాట్లు పడుతున్నారు. శ్రీనివాస్, పరమేష్, రమేష్, సతీష్‌కుమార్, బాబురావు, వినయ్, కళావతి, లక్ష్మీ పాల్గొన్నారు.



హరితహారంలో భాగంగా ఓయూలో నాటిన చెట్లు కాలి బూడిదయ్యాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఫ్యాకల్టీ క్లబ్ సమీపంలో నాలుగేళ్ల క్రితం నాటిన వందలాది మొక్కలు చెట్లుగా మారి సోమవారం అగ్నికి ఆహుతి అయ్యాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో పెరుగుతున్న చెట్లను నెలకు లక్షల వ్యయంతో ట్యాంకర్ల ద్వారా నీరు పోసి పెంచుతున్నారు. రూ. కోట్ల వ్యయంతో నియమించిన సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని ఓయూ జేఏసీ నాయకులు వరంగల్ రవి ప్రశ్నించారు. పథకం ప్రకారమే మంటలను ఆర్పకుండా వర్షాకాలం కొత్తగా మొక్కలు నాటించి బిల్లులు తీసుకోవాలనే అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. –ఉస్మానియా యూనివర్సిటీ

వార్డులో ప్రచారం జోరు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మద్దతుతో సంబంధం లేకుండానే కొందరు ఆశావహులు సొంతంగానే ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. మూడో వార్డులో బీఆర్ఎస్ నుంచి పార్టీ మద్దతు ఆశిస్తున్న నేతలు అజయ్ యాదవ్, రాజు సింగ్ ప్రచారం మొదలు పెట్టారు. పెరుమాల్ దేవస్థాన కమిటీ మాజీ సభ్యుడు అజయ్ యాదవ్ సోమవారం ఉదయ ం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మంత్రి మల్లారెడ్డిని కలిసి ప్రచారం ప్రారంభించారు. మూడో వార్డు కార్కానా మజీద్ దర్గా ప్రాంతంలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోర్డు ఎన్నికల్లో తనను గెలిపిస్తే బస్తీలో తాగు నీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని తెలిపారు.

డ్రైవర్స్ క్వార్టర్స్ ఏరియాలో..

మంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రధాన అనుచరుల్లో ఒకరైన రాజు సింగ్ సైతం మూడో వార్డు నుంచే పోటీకి సిద్ధమయ్యారు. మడ్‌ఫోర్ట్ వర్క్‌షాప్ సమీపంలోని డ్రైవర్స్ క్వార్టర్స్‌లో పర్యటించారు. చాయ్ పే చర్చా పేరిట బస్తీ వాసులతో మాట్లాడారు. బోర్డు ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే బస్తీ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని తెలిపారు. ప్రచారంలో నాగరాజ్, అరుణ్, రమేష్, శ్యామ్ పాల్గొన్నారు.